
సాక్షి కాకినాడ

ఆదివారం । 14 । ఏప్రిల్ । 2024



వాడపల్లికి పోటెత్తిన భక్తులు

ఆత్రేయపురం: వాడపల్లి వేంకటేశ్వరస్వామి వారిని శనివారం వేలాదిగా భక్తులు దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.41,43,642 ఆదాయం సమకూరింది.



డెల్టాకు నీటి విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శనివారం తూర్పు డెల్టాకు 2 వేలు, మధ్య డెల్టాకు 1,550, పశ్చిమ డెల్టాకు 3,600 క్యూసెక్కుల చొప్పున గోదావరి నీటిని విడుదల చేశారు.

గరిష్టం/కనిష్టం 40.0° / 26.5°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	40.0	22.0
కాకినాడ	35.3	26.5
అమలాపురం	39.0	26.0

న్యూస్‌రీల్

జాతీయ అథ్లెటిక్స్‌లో నాగబాబుకు పతకాలు



పతకాలు సాధించిన నాగబాబు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): సికింద్రాబాద్ రైల్వే స్పోర్ట్స్ స్టేడియంలో శనివారం జరిగిన జాతీయ స్థాయి ఓపెన్ అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లాకు చెందిన యాతం నాగబాబు పతకాలు సాధించారు. 800 మీటర్ల పరుగులో బంగారు, 400, 200 మీటర్ల పరుగులో రజత పతకాలు అందుకున్నాడు. కాకినాడలోని జిల్లా మలేరియా విభాగంలో యూనిట్ అధికారిగా నాగబాబు పని చేస్తున్నారు.

రైలులో మహిళ ప్రసవం



తల్లీబిడ్డలను అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తున్న సిబ్బంది

తుని: బెంగళూరు నుంచి కృష్ణగంజ్ వెళుతున్న గౌహతి ఎక్స్‌ప్రెస్ రైలులో శనివారం ఓ మహిళ ప్రసవించింది. రైల్వే ఏఎస్సై అనిల్ కుమార్ కథనం ప్రకారం.. అస్సాం రాష్ట్రం కృష్ణగంజ్‌కు చెందిన హీన పర్వీన్, ఆమె భర్త షహనవాజ్‌తో కలిసి ఈ రైలులో ప్రయాణిస్తున్నారు. తుని సమీపానికి వచ్చేసరికి పురుటి నొప్పులు ఎక్కువ కావడంతో 139 టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేశారు. అధికారులు, రైల్వే పోలీసులు వెంటనే 108కు ఫోన్ చేసి అంబులెన్సును స్టేషన్‌లో సిద్ధంగా ఉంచారు. ఇంతలో నొప్పులు ఎక్కువ కావడంతో సహచర ప్రయాణికులు ఆమెను రైలులోని బాత్‌రూములోకి తీసుకుని వెళ్లి ప్రసవం చేశారు. ఆమె పండంటి ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. తుని రైల్వే స్టేషన్‌లో రైలు ఆగగానే ఆర్‌పీఎఫ్ మహిళా పోలీసులు 108 ఈఎంటీ రమణబాబు స్ట్రెచర్‌ను ప్లాట్‌ఫాం వద్దకు తీసుకుని వెళ్లి, పర్వీన్‌ను, బిడ్డను తుని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారు. పర్వీన్‌కు ముగ్గురు సంతానం ఉండగా నాలుగో కాన్పులో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఆర్‌పీఎఫ్ మహిళా హెడ్ కానిస్టేబుళ్లు సునీత, వాగ్దేవి, శివాజీ, విష్ణుశంకర్‌ను అధికారులు అభినందించారు.

కాకినాడ రూరల్‌లో 19న 'మేమంతా సిద్ధం'

- లక్షలాదిగా రానున్న జనసందోహం
- గ్రాండ్ సక్సెస్ చేయాలి
- జిల్లా నేతలతో సమీక్షలో మిథున్‌రెడ్డి సూచన

సాక్షి ప్రతినిధి, కాకినాడ/కాకినాడ రూరల్: సంక్షేమ సారథి, ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 19వ తేదీ మధ్యాహ్నం కాకినాడ రూరల్‌లో 'మేమంతా సిద్ధం' ఎన్నికల ప్రచార సభ నిర్వహించనున్నారు. దీనిని గ్రాండ్ సక్సెస్ చేయడంలో నేతలందరూ భాగస్వామ్యం వహించాలని వైఎస్సార్ సీపీ ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ప్రాంతీయ సమన్వయకర్త, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి సూచించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు క్యాంపు కార్యాలయంలో 'మేమంతా సిద్ధం' సభ పోస్టర్‌ను శనివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సభ ఏర్పాట్లపై జిల్లాలోని ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, కో ఆర్డినేటర్లలతో సమీక్ష నిర్వహించారు. తొలుత నియోజకవర్గాల వారీగా పార్టీ పరిస్థితిపై అభ్యర్థులతో విడివిడిగా మాట్లాడారు. వైఎస్సార్ సీపీకి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల్లో ఉన్న ఆదరాభిమానాలను నియోజకవర్గాల్లో గెలుపునకు అనువుగా మలచుకోవడంలో క్రియాశీలకంగా వ్యవహరించాలని నేతలకు సూచించారు. అనంతరం 'మేమంతా సిద్ధం' సభను విజయవంతం చేసేందుకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై జిల్లా నేతలతో చర్చించారు. సభ ఎక్కడ నిర్వహించాలి, లక్షలాదిగా తరలివచ్చే జనసందోహానికి ఎటువంటి ఇబ్బందులూ లేకుండా తీసుకోవాల్సిన చర్యలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని నేతలకు సూచించారు. దీనికి ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని మిథున్‌రెడ్డి అన్నారు. ఈ సమీక్షలో ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, ఎంపీ వంగా గీతా విశ్వనాథ్, ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, పార్టీ అభ్యర్థులు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, పెండెం దొరబాబు, తోట నరసింహం, వరుపుల సబ్బారావు, దవులూరి దొరబాబు, కాపు ఉద్యమ నేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం, మాల కార్పొరేషన్ చైర్‌పర్సన్ పెదపాటి అమ్మాజీ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి గుబ్బల తులసీకుమార్, వివిధ విభాగాల ప్రతినిధులు శెట్టిబత్తుల కుమార్‌రాజా, ఒమ్మి రఘురామ్, కొప్పన శివ, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ జమ్మలమడక నాగమణి, పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత, ఎస్సీ కార్పొరేషన్ డైరక్టర్ గగారిన్ తదితరులు పాల్గొన్నారు.



'మేమంతా సిద్ధం' సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మిథున్‌రెడ్డి, కన్నబాబు, చలమలశెట్టి సునీల్, దొరబాబు, తులసీకుమార్ తదితరులు

వలలకు విశ్రాంతి

- సముద్రంలో చేపల వేటపై నేటి అర్ధరాత్రి నుంచి నిషేధం
- జూన్ 14 అర్ధరాత్రి వరకూ అమలు
- వేట విరామ సమయంలో మత్స్యకారులను ఆదుకోనున్న ప్రభుత్వం
- మత్స్యకార భరోసా ద్వారా ఒక్కో కుటుంబానికి రూ.10 వేల చొప్పున సాయం
- బోట్లు, మత్స్యకారుల గుర్తింపునకు సిద్ధమవుతున్న అధికారులు

కాకినాడ కుంభాభిషేకం వద్ద ఒడ్డుకు ముందుగానే చేరుకున్న బోట్లు



కాకినాడ రూరల్: బతుకు నావ సాఫీగా సాగేందుకు.. నిత్యం సముద్ర అలల హోరులో.. పది నెలల పాటు సాహసమే జీవితంగా గడుపుతున్న మత్స్యకారులు.. రెండు మాసాలు విశ్రాంతి తీసుకోనున్నారు. వలలకూ విశ్రాంతినివ్వనున్నారు. మత్స్యసంపద పెరిగే కాలం కావడంతో రెండు నెలల పాటు సముద్రంలో చేపల వేటపై ప్రభుత్వం నిషేధం అమలు చేస్తోంది. ఈ నేపథ్యంలో చేపల వేటకు వేకువజామునే కడలి తరగల పైకి పయనమయ్యే మత్స్యకారులు.. ఈ నిషేధ కాలంలో ఇంటి పట్టునే ఉండనున్నారు.

సముద్రంలో చేపల పునరుత్పత్తి సమయం కావడంతో కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఏటా బంగాళాఖాతంలో ఏప్రిల్ 15 నుంచి చేపల వేటపై నిషేధం అమలు చేస్తున్నారు. తూర్పు తీరంలోని పశ్చిమ బెంగాల్ నుంచి తమిళనాడులోని కన్యాకుమారి వరకూ సముద్రంలో చేపల వేటపై నిషేధం ఆదివారం అర్ధరాత్రి నుంచి జూన్ 14వ తేదీ అర్ధరాత్రి వరకూ అమలులో ఉంటుంది. ఈ నేపథ్యంలో సోమవారం నుంచి చేపల వేట నిషేధం అమలుకు పోలీసుల సహకారంతో మత్స్యశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే జిల్లాలోని మత్స్యకారులు సముద్రంలో వేట ముగించుకుని ఒడ్డుకు చేరుతున్నారు.

వేట విరామ భృతి అందిస్తున్న ప్రభుత్వం

జిల్లాలో తీరప్రాంత మండలాలు :	తొండంగి, యు.కొత్తపల్లి, కాకినాడ రూరల్, కాకినాడ అర్బన్, తాళ్లరేవు
సముద్ర తీరం :	సుమారు 94 కిలోమీటర్లు
మత్స్యకార ఆవాసాలు :	58
మత్స్యకారులు :	1,95,184
సముద్రంలో చేపల వేట చేస్తున్న వారు:	36,101
మొత్తం బోట్లు :	4,645
వీటిలో మెకనైజ్డ్ :	467
మోటరైజ్డ్ :	3,779
సంప్రదాయ బోట్లు :	399

సముద్రంలో చేపల వేటపై నిషేధం కారణంగా జీవనం కోల్పోతున్న మత్స్యకారులను ఆదుకునేందుకు ప్రభుత్వం వేట విరామ భృతి అందిస్తోంది. ఒక్కో కుటుంబానికి రూ.10 వేల చొప్పున అందిస్తోంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వేట నిషేధ భృతి రూ.4 వేలు మాత్రమే ఉండగా దీనిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.10 వేలకు పెంచి, వైఎస్సార్ మత్స్యకార భరోసా పేరిట 2019 నుంచి అందిస్తోంది. ఈ ఏడాది ఈ భృతి అందించేందుకు మత్స్యశాఖ అధికారులు చేపల వేట సాగించే బోట్లకు ఫొటోలు తీసుకుని, లబ్ధిదారుల నమోదు చేపట్టనున్నారు.

మత్స్యకార భరోసాకు గుర్తింపు ఇలా..

వేట విరామ భృతి పొందేందుకు 18 మీటర్ల వరకూ పొడవు ఉన్న మెకనైజ్డ్ బోట్‌కు యజమాని మినహా 8 మందికి, మోటరైజ్డ్ బోట్లకు యజమానితో కలిపి ఆరుగురికి, సంప్రదాయ బోట్లుకు ముగ్గురు చొప్పున మత్స్యకారులు అర్హులు. బోట్ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు, ఫిషింగ్ లైసెన్స్, ఆధార్ కార్డు, రైస్ కార్డు, బ్యాంక్ అకౌంట్ వివరాలను అందజేయాల్సి ఉంటుంది.

వెంటనే లబ్ధిదారుల గుర్తింపు



సముద్రంలో చేపల వేటపై నిషేధం అమలులోకి వచ్చిన వెంటనే మత్స్యకార భరోసా సాయం అందించేందుకు లబ్ధిదారుల గుర్తింపు చేపడతాం. వేట నిషేధాన్ని ఎవరైనా ఉల్లంఘిస్తే ఆంధ్రప్రదేశ్ మెరైన్ రెగ్యులేషన్ చట్టం–1994 ప్రకారం చర్యలు తీసుకుంటాం. చేపలు, పడవలు స్వాధీనం చేసుకుని జరిమానా విధిస్తాం. కుంభాభిషేకం రేవు, ఫిషింగ్ హార్బర్లలో చేపలు అమ్మడం, ప్యాకింగ్ చేయరాదు. ఐస్ అమ్మరాదు. వేట నిషేధంపై మత్స్యకారులు, వ్యాపారులకు నోటీసులు అందించాం. పంచాయతీ కార్యాలయాల వద్ద నోటీసు బోర్డుల్లో కూడా ఉంచుతున్నాం. టాంటాం ద్వారా ప్రచారం చేస్తున్నాం.

– కొమ్ము కరుణాకరరావు, జిల్లా మత్స్యశాఖ అధికారి, కాకినాడ

శృంగార వల్లభునికి రూ.3.22 లక్షల ఆదాయం



ప్రత్యేక అలంకరణలో శృంగారవల్లభ స్వామి

పెద్దాపురం: తిరుపతి గ్రామంలో స్వయంభువుగా వెలసిన శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వేకువజాము నుంచే సుమారు 15 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని, ముడుపులు, మొక్కుబడులు చెల్లించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా ఆలయ కమిటీ చైర్మన్ కర్రి వెంకట జగదీశ్వరరావు, ఈఓ వడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యాన ఏర్పాట్లు చేశారు. సుగంధ పరిమళాలు వెదజల్లే పూలమాలికలతో స్వామివారిని అర్చకులు ప్రత్యేకంగా అలంకరించారు. వివిధ సేవల టికెట్లు, అన్నదానం, కేశఖండన ద్వారా స్వామి వారికి రూ.3,22,796 ఆదాయం సమకూరిందని ఈఓ శ్రీనివాస్ తెలిపారు. భక్తులకు ప్రసాద వితరణ, అన్నదానంతో పాటు ఎండ తీవ్రత నేపథ్యంలో మజ్జిగ చలివేంద్రం కూడా ఏర్పాటు చేశారు.

బీసీ సంఘాల రాష్ట్ర నేత

వైఎస్సార్ సీపీలో చేరిక



యనమదల రవి, విష్ణుబాబు తదితరులను వైఎస్సార్ సీపీలోకి స్వాగతిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

- జగన్‌కు జై కొట్టిన యనమదల రవి, అనుచరులు
- స్వాగతించిన పార్టీ జిల్లా అధ్యక్షుడు కన్నబాబు

కాకినాడ రూరల్: కాకినాడకు చెందిన బీసీ సంఘాల రాష్ట్ర ఉపాధ్యక్షుడు, రాష్ట్ర వైద్య, ఆరోగ్య మౌలిక సదుపాయాల సంస్థ మాజీ చైర్మన్ యనమదల రవి తన అనుచరులతో కలసి వైఎస్సార్ సీపీలో చేరారు. ఆయనతో పాటు ఆర్‌ఎంపీ డాక్టర్స్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యుడు యల్లబోయిన విష్ణుబాబు, వాసంశెట్టి దుర్గాప్రసాద్, కాదా శ్రీనివాస్, చింతాకుల చినరాజు, ముమ్మిడి రాంబాబు, ఘంటసాల రాంబాబు తదితరులు పార్టీలో చేరారు. కాకినాడ రెండో డివిజన్ ఆర్ ఆర్ నగర్‌లో శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో వారికి వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో ఏ ప్రభుత్వమూ చేపట్టని విధంగా సీఎం జగన్ వివిధ సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. ఆయన బీసీ పక్షపాతి అని చెప్పారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత బీసీ, ఎస్సీ, ఎస్టీ, మహిళలకు 50 శాతం పదవులు కేటాయించారన్నారు. బీసీల కోసం 136 కార్పొరేషన్లు ఏర్పాటు చేశారని తెలిపారు. కార్పొరేషన్ పదవులతో చిన్నచిన్న సామాజికవర్గ నాయకులకు సైతం పదవులతో గుర్తింపు ఇచ్చారన్నారు. చంద్రబాబు ఎన్నికల ముందు ఓట్ల కోసం వస్తున్నారని, ఆయన హామీలను నమ్మవద్దని కోరారు. పార్టీలో చేరిన వారందరూ ఇక నుంచి వైఎస్సార్ సీపీ కుటుంబమని, అందరం కలసి జగన్ టీమ్‌గా పని చేద్దామని అన్నారు. శెట్టిబలిజతో పాటు బీసీ కులాలకు పెద్ద ఎత్తున కమ్యూనిటీ భవనాలు నిర్మించామని, వారి ఆనందం చూసి, తనకు సంతోషం వేసిందని కన్నబాబు చెప్పారు. యనమదల రవి మాట్లాడుతూ, 2003లో చంద్రబాబు ప్రభుత్వ పదవీ కాలం ముగింపు వేళ తనను రాష్ట్ర వైద్య, ఆరోగ్య మౌలిక సదుపాయాల సంస్థ చైర్మన్‌గా నియమించారని, బీసీలంటే ఆయనకు చిన్న చూపు అని విమర్శించారు. శెట్టిబలిజలకు వైఎస్సార్ ఎంతో గౌరవం ఇచ్చారని, అదే బాటలో జగన్ నడుస్తున్నారని అన్నారు. ప్రాణమున్నంత వరకూ కన్నబాబు వెంటే నడుస్తానని, ఆయన విజయానికి శక్తివంచన లేకుండా పని చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, పాలిక శ్రీను, అల్లి రాజబాబు, కళ్యాణి, ఎల్లబోయిన చిన్న, సీనియర్ నాయకుడు కురసాల సత్యనారాయణ, తిమ్మాపురం సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ, మాజీ కార్పొరేటరు వడ్డి మణికుమార్ తదితరులు పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీలో చేరిన అనంతరం యనమదల రవి పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ పి.మిథున్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు తదితరులు పాల్గొన్నారు. కాగా, యనమదల రవి సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డిని కూడా ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

పవన్‌ను ప్రజలు నమ్మడం లేదు

పిఠాపురం: ముఖానికి మేకప్ వేసుకుని వచ్చే పవన్ కల్యాణ్‌ను ప్రజలు నమ్మడం లేదని మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు మాదిగ అన్నారు. పిఠాపురంలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు వంగా గీత, చలమలశెట్టి సునీల్‌కు మద్దతుగా ఆయన శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, బడుగు బలహీన వర్గాలు అభివృద్ధి చెందాలంటే వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అధిక సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత వైఎస్సార్ సీపీదేనన్నారు. చంద్రబాబు హయాంలో నలుగురికి పథకాలిచ్చి మిగిలిన దళితులందరినీ మోసం చేశారని చెప్పారు. నటన కోసం ముఖానికి రంగులు వేసుకునే జనసేన అధినేత పవన్ కల్యాణ్ పిఠాపురంలో నటించడానికి వస్తున్నారన్న సంగతిని ఇక్కడి ప్రజలు గమనించారని, అందుకే ఎవరూ ఆయనను నమ్మడం లేదని అన్నారు. నియోజకవర్గంలో ఎంత కాలం ఉంటారో ఆయనకే తెలియదని, ఇంక ప్రజలనేం ఉద్ధరిస్తారని ఎద్దేవా చేశారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేగా వంగా గీతను, ఎంపీగా చలమలశెట్టి సునీల్‌ను అఖండ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. వైఎస్సార్ సీపీ విజయం కోసం తాము రాష్ట్రంలోని పలు నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారం చేస్తున్నామని, అన్నిచోట్లా వైఎస్సార్ సీపీకి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని చెప్పారు. ప్రజల ఉత్సాహం చూస్తుంటే సీఎం వైఎస్ జగన్ అంటున్నట్టుగానే 175కి 175 సీట్లు వచ్చేలా కనిపిస్తోందని, ఈ ఎన్నికలతో టీడీపీ, జనసేన, బీజేపీలు కాలగర్భంలో కలిసిపోవడం ఖాయమని కనకారావు అన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న కనకారావు

అప్పనపల్లి బాలాజీకి రూ.2.26 లక్షల ఆదాయం

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి ఆలయం శనివారం భక్తులతో కోలాహలంగా మారింది. శ్రీదేవి, భూదేవి సమేతంగా కొలువు తీరిన స్వామివారి దర్శనానికి భక్తులు భారీగా తరలి వచ్చారు. పవిత్ర వైనతేయ గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించారు. కొందరు భక్తులు తలనీలాలు సమర్పించారు. భక్తులు భారీగా రావడంతో పాత గుడితో పాటు కొత్త గుడి కిక్కిరిసింది. నిత్యం నిర్వహించే శ్రీలక్ష్మీ నారాయణ హోమం వైభవంగా జరిగింది. స్వామి వారికి రూ.2.26 లక్షలు ఆదాయం వచ్చిందని ఈఓ గ్రంధి మాధవి తెలిపారు. లడ్డూ ప్రసాదం, దర్శనం టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.1.81 లక్షలు, నిత్యాన్నదానం ట్రస్టుకు విరాళంగా రూ.44,641 వచ్చాయన్నారు. 3,164 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారని, 2,380 మంది అన్న ప్రసాదం స్వీకరించారని తెలిపారు.

మినీ బస్సును ఢీకొన్న లారీ

తుని రూరల్: తుని మండలం గవరయ్య కోనేరు సమీపంలో ఎర్రవరం వెళుతున్న ప్రైవేట్ మినీ బస్సును వెనుక నుంచి లోడు లారీ ఢీకొంది. శనివారం జరిగిన ఈ సంఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న 14 మంది స్వల్పంగా గాయపడ్డారు. వీరంతా రొయ్యల ఫ్యాక్టరీలో పనిచేసేందుకు తుని, మర్లపాడు, చేపూరు తదితర గ్రామాల నుంచి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. స్వల్పగాయాలతో బయటపడిన క్షతగాత్రులను వేర్వేరు ఆస్పత్రులకు తరలించి చికిత్స చేయించారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసినట్టు రూరల్ ఎస్సై రమేష్ బాబు తెలిపారు.



మినీ బస్సును ఢీకొన్న లారీ

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

శంఖవరం: కత్తిపూడి – శంఖవరం రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కొప్పిరెడ్డి దొరబాబు (34) మృతి చెందాడు. అన్నవరం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దొరబాబు కత్తిపూడికి ద్విచక్ర వాహనంపై వెళుతున్నాడు. స్థానిక పెట్రోల్ బంక్ సమీపంలో అతడిని కత్తిపూడి నుంచి వస్తున్న టిప్పర్ వేగంగా ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన దొరబాబును 108లో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. దొరబాబు తాపీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు టిప్పర్ ను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఐ.కిశోర్ తెలిపారు.

రైలు నుంచి జారిపడి..

తుని: స్థానిక జీఆర్పీ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని బయ్యవరం – నర్సింగపల్లి మధ్యలో రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి (సుమారు 45 ఏళ్లు) మృతి చెందాడని తుని జీఆర్పీ ఇన్చార్జి ఎస్సై లోవరాజు తెలిపారు. శనివారం అందిన సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించామన్నారు. విశాఖపట్నం నుంచి విజయవాడ వైపు వెళుతున్న గుర్తు తెలియని రైలు నుంచి ప్రమాదవశాత్తూ జారిపడి మృతి చెందినట్టు భావిస్తున్నామన్నారు. మృతుడి ఒంటిపై నిక్కరు, లేత నాచురంగు టీషర్ట్ ఉన్నాయని, ఎడమ చేతిపై హిందీలో పచ్చబొట్టు ఉందన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.